మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక

## జాతీయ రోడ్డు భద్రతా మాసం ప్రారంభం




3లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 184 | శుక్రవారం 02 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## అద్దంకిలో డిజిటల్ అరెస్ట్ పేరుతో
# ఘరానా మోసం

- ☐ రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి నుంచి రూ.1.23 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- ☐ వీడియో కాల్‌లో బెదిరింపులు ఇంటి శోధన పేరుతో మానసిక వేధింపులు
- ☐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు





మన గళం, అద్దంకి : డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాదు, విద్యావంతులను కూడా బురిడీ కొట్టిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ప్రకాశం జిల్లా అద్దంకిలో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని బెదిరించి ఏకంగా రూ.1.23 కోట్లను కాజేసిన ఘరానా మోసం వెలుగుచూసింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం.. అద్దంకి పట్టణానికి చెందిన శ్రీరామ్ నాగేశ్వరరావు గతంలో ఐడీబీఐ బ్యాంక్‌లో లోన్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేశారు. కొద్ది రోజుల క్రితం తనకు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, విధుల్లో ఉన్న సమయంలో అక్రమాలు జరిగాయని, దీనిపై కేసు నమోదైందని చెప్పారు. తాను, తన భార్యను వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ "డిజిటల్ అరెస్ట్" పేరుతో భయభ్రాంతులకు గురిచేశారు. కేసు నుంచి తప్పించుకోవాలంటే డబ్బులు చెల్లించాలని నమ్మించి, విడతల వారీగా రూ.1.23 కోట్లను వివిధ అకౌంట్లకు బదిలీ చేయించారు. సైబర్ నేరగాళ్ల బెదిరింపులు అత్యంత దారుణంగా ఉన్నాయని బాధితుడు 2 లో..

## నంద్యాల జిల్లాలో హృదయవిదారక ఘటన

- ముగ్గురు చిన్నారులకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్య
- కుటుంబ విషాదం - ఆర్థిక, మానసిక ఒత్తిడులే కారణాలా?
- ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



నంద్యాల, జనవరి 1 మన గళం,):ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో గుండెలు పిండేసే విషాద ఘటన చోటుచేసుకుంది. ఉయ్యాలవాడ 2 లో..

## ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌లో నూతన సంవత్సర వేడుకలు

- సీఈవో రాజేంద్ర కుమార్ నేతృత్వంలో కేక్ కటింగ్
- సిబ్బందికి డైరీలు, క్యాలెండర్ల పంపిణీ



హైదరాబాద్, జనవరి 1 మన గళం, :2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో ఆత్మీయ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్ర కుమార్ నేతృత్వంలో ప్రత్యేక కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలు ఐక్యత, కృతజ్ఞత, సేవా సంకల్పాన్ని ప్రతిబింబించాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో 2 లో..

## పీ4 కార్యక్రమంతో సమగ్ర గ్రామాభివృద్ధి సాధ్యం: గొట్టిపాటి రవికుమార్



- అంబేడ్కర్ స్ఫూర్తితో సమానత్వానికి బాట
- సీఎస్ఆర్ భాగస్వామ్యంతో గ్రామాల అభ్యున్నతి

అద్దంకి, జనవరి 1 మన గళం, : నూజెల్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించిన అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, 2 లో..

## సంక్రాంతికి విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు




2 లో..

## వందే భారత్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్



2 లో..

- 2026 జనవరిలో వందే భారత్ స్లీపర్ రైళ్లు
- ట్రయల్ రన్స్ పూర్తి - త్వరలో పట్టాలెక్కనున్న రైలు
- టికెటింగ్‌లో అక్రమాలకు చెక్ ఐఆర్‌సీటీసీ కఠిన చర్యలు

## డీఆర్‌డీఓ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన రక్షణ మంత్రి



2 లో..

- స్వదేశీ సాంకేతికతలతో సాయుధ దళాలకు బలం
- ఆపరేషన్ 'సిందూర్'లో డీఆర్‌డీఓ ఆయుధాల కీలక పాత్ర

## ఒడిశాలో రెవెన్యూ అధికారిపై విజిలెన్స్ దాడులు

2 లో..





# వందే భారత్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్

న్యూఢిల్లీ, జనవరి 1 మన గళం, : వందే భారత్ రైళ్లలో ప్రయాణించే వారికి కొత్త ఏడాది శుభవార్త అందింది. 2026 జనవరిలోనే తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించేందుకు భారతీయ రైల్వే సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు రైల్వే శాఖ కీలక ప్రకటన చేసింది. రైలు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా వందే భారత్ స్లీపర్ ట్రైన్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే వందే భారత్ స్లీపర్ రైళ్లకు సంబంధించిన ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి. ట్రయల్స్ సమయంలో వచ్చిన అనుభవాల ఆధారంగా కొన్ని సాంకేతిక మార్పులు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ మార్పులు దాదాపుగా పూర్తయ్యాయని, కొత్త ఏడాది ప్రారంభంలోనే ఈ స్లీపర్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. దీర్ఘదూర రాత్రి ప్రయాణాలు చేసే ప్రయాణికులకు ఇది మరింత సౌకర్యంగా మారనుందని భావిస్తున్నారు. భారత్‌లో రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునీకీకరించడంలో భాగంగా అనేక కొత్త ఆవిష్కరణలు చేపడుతున్నామని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే నాన్ ఏసీ ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టామని, ఇకపై ఏసీ ప్రయాణికుల కోసం వందే భారత్ స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపింది. ఈ నెల 26 నాటికి దేశవ్యాప్తంగా 164 వందే భారత్ సర్వీసులు సేవలు అందిస్తున్నాయని వెల్లడించింది.మరోవైపు రైల్వే టికెటింగ్ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కఠిన చర్యలు చేపట్టినట్లు రైల్వే శాఖ తెలిపింది. పారదర్శకత పెంచే దిశగా 5.73 కోట్ల అనుమానాస్పద ఐఆర్‌సీటీసీ అకౌంట్లను గుర్తించి బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. అలాగే తత్కాల్ టికెట్లలో అక్రమాలు జరగకుండా ఆధార్ వెరిఫికేషన్‌ను తప్పనిసరి చేసినట్లు పేర్కొంది. ఈ చర్యలతో రైలు ప్రయాణికులకు న్యాయమైన, పారదర్శకమైన టికెటింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుందని రైల్వే అధికారులు తెలిపారు.

# డీఆర్‌డీఓ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 1 మన గళం, :డీఆర్‌డీఓ 68వ స్థాపన దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ బృందాన్ని ప్రశంసించిన ఆయన, స్వదేశీ సాంకేతికతల ద్వారా భారత సాయుధ దళాలకు ఆధునిక ఆయుధ వ్యవస్థలు, ప్లాట్‌ఫాంలు అందిస్తూ దేశ రక్షణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచిందని కొనియాడారు.డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలు సాయుధ దళాల ఆపరేషన్లలో కీలక పాత్ర పోషిస్తున్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఆపరేషన్ 'సిందూర్' సమయంలో డీఆర్‌డీఓ సాంకేతికతల ప్రభావం స్పష్టంగా కనిపించిందని, ఇది సంస్థ వృత్తిపరమైన నైపుణ్యం, దేశ భద్రత పట్ల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.దేశీయ పరిశోధన, ఆవిష్కరణల ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా డీఆర్‌డీఓ కీలకంగా ముందుకు సాగుతోందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రాబోయే కాలంలో మరింత ఆధునిక, అత్యాధునిక సాంకేతికతలతో సాయుధ దళాలను బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# ఒడిశాలో రెవెన్యూ అధికారిపై విజిలెన్స్ దాడులు

- అత్త ఇంట్లో 75 లక్షల నగదు స్వాధీనం
- మొత్తం 82 లక్షల నగదు, బంగారం, స్థిరాస్తులు సీజ్

భువనేశ్వర్, జనవరి 1 మన గళం, :ఒడిశాలో అవినీతి నిరోధక శాఖ భారీగా నగదు స్వాధీనం చేసుకుంది. అదనపు రెవెన్యూ అధికారి జితేంద్ర కుమార్ పండాకు సంబంధించిన అత్త ఇంట్లో నుంచి విజిలెన్స్ అధికారులు రూ.75 లక్షల నగదును రికవరీ చేశారు. ఈ ఘటన కటక్ జిల్లాలోని బరాంగ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. తాళం వేసి ఉన్న ఇంటిని తెరిపించి అధికారులు సోదాలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పండాకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మొత్తం రూ.82 లక్షల నగదుతో పాటు బంగారం, విలువైన స్థిరాస్తులను సీజ్ చేశారు. రెవెన్యూ అధికారి పండా ఇంట్లోనే ఆయన అత్త నివసిస్తుండగా, అక్కడ భారీగా నగదు దొరకడం సంచలనంగా మారింది. స్వాధీనం చేసిన నగదును ఇంకా పూర్తిగా లెక్కిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సోదాల్లో భాగంగా జితేంద్ర కుమార్ పండాకు అనేక స్థిరాస్తులు ఉన్నట్లు విజిలెన్స్ గుర్తించింది. భువనేశ్వర్ నగరంలో మూడు ట్రిపుల్ స్టోరీ భవనాలు, రెండు బీహెచ్‌కే ఫ్లాట్లు ఉన్నట్లు తేలింది. అదేవిధంగా ఖోర్ధా జిల్లాలో ఒక డబుల్ స్టోరీ భవనం కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా భువనేశ్వర్‌లోని అత్యంత సంపన్న ప్రాంతాల్లో నాలుగు ఖరీదైన ప్లాట్లు కూడా ఆయన పేరిట ఉన్నట్లు వెల్లడైంది. మరో ప్రాంతంలో నిర్వహించిన సోదాల్లో అదనంగా రూ.7 లక్షల నగదు, వంద గ్రాముల బంగారాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని చెందిన లాకర్ వివరాలను కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఆదాయానికి మించిన ఆస్తులపై దర్యాప్తు కొనసాగుతోందని ఒడిశా విజిలెన్స్ శాఖ స్పష్టం చేసింది.

# అద్దంకిలో డిజిటల్ అరెస్ట్ పేరుతో ఘరానా మోసం

పోలీసులకు తెలిపాడు. ఆధార్ వివరాలతో కెనరా బ్యాంక్ డూప్లికేట్ ఖాతా తెరిచామని చెబుతూ వాట్సాప్‌లో పత్రాలు పంపారు. నగదు హవాలా చేస్తున్నారంటూ ఆరోపణలు చేస్తూ, వీడియో కాల్ ద్వారా ఇంటి శోధన పేరుతో బీరువాలో ఉన్న షేర్ మార్కెట్ పత్రాలు కూడా చూపించాలని ఒత్తిడి చేశారు. ఇంట్లో ఉన్న బంగారం, షేర్లు అమ్మి వెంటనే వారు చెప్పిన ఖాతాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. భార్య కళ్లకు కనిపించకపోతే ఎక్కడికి వెళ్లిందంటూ ప్రశ్నలు వేయడం, బయటకు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి కల్పించారు. మరిన్ని డబ్బుల కోసం ఒత్తిడి పెరగడంతో అనుమానం వచ్చిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. మోసపోయానని గ్రహించిన ఆయన ముందుగా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం ఇచ్చి, వారి సూచన మేరకు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇల్లు కూడా అమ్మి డబ్బులు చెల్లించాలని నేరగాళ్లు డిమాండ్ చేయగా, తాను పోలీసులను ఆశ్రయిస్తానని చెప్పడంతో ఫిజికల్ అరెస్ట్ చేస్తామని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సుబ్బరాజు తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనే పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు లేదా ప్రభుత్వ సంస్థలు ఎప్పుడూ ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తామని బెదిరించరని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# నంద్యాల జిల్లాలో హృదయవిదారక ఘటన

మండలం తుడుమలదిన్నె గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్ర (35) తన ముగ్గురు చిన్న పిల్లలకు విషం ఇచ్చి హత్య చేసి, అనంతరం తాను కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసుల వివరాల ప్రకారం గురువారం నాడు సురేంద్రతో పాటు అతని పిల్లలు కావ్యశ్రీ (7), జ్ఞానేశ్వరి (4), సూర్య గగన్ (2) మృతదేహాలు ఇంట్లో గుర్తించబడ్డాయి. పిల్లలకు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి తాగించి, వారు మృతి చెందిన అనంతరం సురేంద్ర ఉరివేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలంలో ఆహారం, కూల్‌డ్రింక్ నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. సురేంద్ర భార్య మహేశ్వరి అనారోగ్య కారణాలతో 2025 ఆగస్టు 16న ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత నుంచి ముగ్గురు పిల్లల ఆలనాపాలన సురేంద్రే చూసుకుంటున్నాడు. నిర్మాణ పనులకు వెళ్లే సురేంద్ర భార్య మరణంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని, ఆర్థిక ఇబ్బందులు, పిల్లలను ఒంటరిగా పెంచుకోవాల్సిన ఒత్తిడి, మద్యానికి బానిస కావడం వంటి అంశాలు అతన్ని తీవ్ర ఒత్తిడికి నెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ ఘటన మద్యం మత్తులో చోటుచేసుకుని ఉండొచ్చన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ పోలీసులు తెలిపారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారుల మృతి స్థానికులను కలచివేసింది.

# ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌లో నూతన సంవత్సర వేడుకలు

పనిచేస్తున్న సిబ్బందికి నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కొత్త ఏడాదిని నూతన ఉత్సాహంతో, స్పష్టమైన లక్ష్యాలతో ప్రారంభించాలని, సేవా కార్యక్రమాల్లో మరింత నిబద్ధత చూపాలని సీఈవో రాజేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. 2026 సంవత్సరం ఆరోగ్యం, ఆనందం, విజయాలతో నిండాలని ఆయన ఆకాంక్షించారు.సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, రాబోయే ఏడాదిలో మరిన్ని అవకాశాలు, సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని సంకల్పం వ్యక్తం చేసింది. బృందంగా కలిసి పనిచేస్తూ సమాజాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ట్రస్ట్ సిబ్బంది ఈ సందర్భంగా తెలిపారు.



# పీ4 కార్యక్రమంతో సమగ్ర గ్రామాభివృద్ధి సాధ్యం: గొట్టిపాటి రవికుమార్

సమాజంలో కుల, మతాల మధ్య ఉన్న అసమానతలను నిర్మూలించేందుకు డా. బీఆర్ అంబేద్కర్ చేసిన మహత్తర కృషి దేశానికి శాశ్వత మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. అంబేద్కర్ చూపిన సమానత్వ భావన నేటి పాలనకు కూడా ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు.అదే స్ఫూర్తితో పీ4 కార్యక్రమం ద్వారా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమానత్వం, సమగ్ర గ్రామాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వంపై మాత్రమే ఆధారపడకుండా, ఆర్థికంగా బలంగా ఉన్నవారు ముందుకొచ్చి సేవాభావంతో ఆసరా అందిస్తే రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో వేగంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.ఈ దిశగా అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 20కిపైగా కమ్యూనిటీ హాళ్లు సీఎస్ఆర్ నిధులతో నిర్మాణంలో ఉండటం సమిష్టి అభివృద్ధికి నిదర్శనమని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సమాజ హితం, గ్రామాల అభ్యున్నతి కోసం పీ4 కార్యక్రమంలో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# సంక్రాంతికి విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

అమరావతి, జనవరి 1 మన గళం, :సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భారతీయ రైల్వే విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే శాఖ వివరాల ప్రకారం, విశాఖపట్నం నుంచి చర్లపల్లికి వెళ్లే ప్రత్యేక రైలు నంబరు 08511 జనవరి 10, 12, 17, 19 తేదీల్లో విశాఖపట్నంలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఇదే రైలు తిరుగు ప్రయాణంలో జనవరి 11, 13, 18, 20 తేదీల్లో చర్లపల్లిలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7 గంటలకు విశాఖపట్నానికి చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా,



రైలు నంబరు 07416 అనకాపల్లి నుంచి వికారాబాద్ కు ప్రత్యేకంగా నడవనుంది. ఈ రైలు జనవరి 18న రాత్రి 9.45 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వికారాబాద్‌కు చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో విజయవాడ మీదుగా ప్రయాణించే రైళ్లకు భారీ డిమాండ్ ఉండటంతో, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకుని ఈ ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శుక్రవారం
02 - 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## నేడు 'డయల్ యువర్ కమిషనర్'



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర పరిధిలో ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు శుక్రవారం 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 09:00 గంటల నుండి 10:00 గంటల వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, నగర ప్రజలు తమ కాలనీల్లో స్థానిక సమస్యలను ఫోన్ ద్వారా నేరుగా తెలియజేయవచ్చని సూచించారు. తాగునీటి సమస్యలు, వీధి దీపాల మరమ్మతులు, రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫోన్ నెంబర్ 08518221847 కు కాల్ చేసి తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

## జాతీయ రోడ్డు భద్రతా మాసం ప్రారంభం

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి**



మనగళం, నంద్యాల : ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడమే నిజమైన రోడ్డు భద్రత అని, ప్రజల సహకారం, సమష్టి కృషితోనే సురక్షిత రహదారులను సాధించవచ్చని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర సందర్భంగా జాతీయ రోడ్డు భద్రతా మాసం 2026 ప్రారంభోత్సవ బ్యానర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు అనేక కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టుతున్నాయని తెలిపారు. ఇది కేవలం గణాంకాల అంశం కాదని, మనందరి బాధ్యతగా భావించి మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2024 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ముఖ్యంగా యువత, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో రోడ్డు భద్రతపై సమగ్ర దృష్టి సారించడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ ఏడాది జాతీయ రోడ్డు భద్రతా మాసం నినాదంగా ఎంపిక చేసిన"శిక్షతో భద్రత, సాంకేతికతతో పరివర్తన", రోడ్డు భద్రత సాధనకు ఎంతో ప్రాసంగికమైనదని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షతో భద్రత అనగా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన వాహన చలనం అలవాట్లను పెంపొందించడమని వివరించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదన్న స్పష్టమైన సందేశం ప్రతి ఒక్కరికి చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో రోడ్డు భద్రత బ్యానర్ ను విడుదల చేసిన ఎస్పీ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సునీల్ షోరాణ్ రోడ్డు భద్రత బ్యానర్ ను విడుదల చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికతతో పరివర్తన అనగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రోడ్డు ప్రమాదాలను ముందుగానే నివారించడమని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత కెమెరాలు, స్పీడ్ మానిటరింగ్ వ్యవస్థలు, ప్రమాదకర ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్) గుర్తింపు, స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి చర్యల ద్వారా రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని వివరించారు. రోడ్డు భద్రత లక్ష్య సాధనకు పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు, ఏపీఎస్ ఆర్టీసీ, ఎన్ హెచ్ఏఐ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా జిల్లాస్థాయిలో రోడ్డు




ప్రమాదాల తగ్గింపునకు కొలిచే లక్ష్యాలను నిర్దేశించుకొని, జీరో ఫాటాలిటీ దిశగా ముందడుగు వేయాలని ఎస్పీలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప రవాణా అధికారి శివారెడ్డి ఆర్అండ్ బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

**– కుడా చైర్మన్ సోమిశెట్టి**



మనగళం, కర్నూలు సిటీ : కూటమి సర్కార్ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన సోమిశెట్టి ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలన నుంచి .. రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారన్నారు. అభివృద్ధి-సంక్షేమ సమతూల్యతతో ముందుకు నడిపిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2025లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్సిక్స్ పథకాలు ప్రజల నుంచి విశేష ఆదరణ పొందాయన్నారు. తల్లికి వందనం పథకం లక్షల మంది విద్యార్థులకు నేరుగా అందించడం ద్వారా విద్యారంగానికి బలమైన భరోసా కల్పించారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, ఎక్కడైనా పింఛన్ పొందే వెసులుబాటు కల్పించారని గుర్తు చేశారు. 204 అన్న క్యాంటిన్ ద్వారా ఇప్పటివరకు నాలుగు కోట్ల మందికి భోజనాలు అందించారని అన్నారు. అదేవిధంగా మంత్రి వర్యులు టి.జి.భరత్ జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా టీజీ భరత్ ముందుకు సాగుతున్నారని తెలిపారు.

## కార్మికుల అభ్యున్నతికి ప్రాధాన్యం

**– నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్**






మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తన నివాస కార్యాలయంలో కార్మికులకు మిఠాయి బాక్సులు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకన్నా ముందు కమిషనర్ తన సతీమణి పి.చంద్రకళతో కలిసి కార్మికులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూడ ప్రజారోగ్యం, ప్రాథమిక మానవ అవసరాలను సమర్థవంతంగా తీర్చడంలో కార్మికుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. అందుకే వారి సంక్షేమానికి నగరపాలక సంస్థ ఎప్పుడూ వెనకాడలేదన్నారు. కార్మికులకు వేతనాలు, కిట్లు వంటి సదుపాయాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను కార్మికులతో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల అభ్యున్నతికి చట్టపరిధిలో సాధ్యమైన అన్ని సౌకర్యాలు ఎటువంటి జాప్యం లేకుండా కల్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా తహశీల్దార్ రవికుమార్, అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ యన్.చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఇంచార్జి ఎస్.ఈ. శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామకృష్ణ, మంజూర్ బాషా, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు కమిషనర్‌కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా నూతన సంవత్సరం వేడుకలు







మనగళం, కర్నూలు సిటీ : జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరం 2026వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గుడుశె క్రిష్ణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పూలనాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పూరస్కరించు కొని కార్యకర్తల మధ్య కేక్ ను కట్ చేశారు. ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు గుడుశె క్రిష్ణమ్మ, పూలనాగరాజు యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజులలో తెలుగుదేశంపార్టీని ముందుకు నడిపించేందుకు ప్రతి ఒకరి సహకారం అందించాలని కోరారు. నాయకులు, కార్య కర్తల సహకారంతో పార్టీని బలోపేతం చేస్తూ వారికి అందుబాబులో ఉంటూ కార్యకర్తలు తమ దృష్టికి తీసుకొని వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు.

# జిల్లా అభివృద్ధికి కష్టపడి పని చేద్దాం

– అధికారులకు పిలుపునిచ్చిన కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి














మనగళం, కర్నూలు సిటీ : నూతన సంవత్సరం 2026 లో కర్నూలు జిల్లా అభివృద్ధికి మనమందరం సమిష్టిగా కష్టపడి పని చేద్దామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులకు పిలుపునిచ్చారు. ఆంగ్ల నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకొని.... గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు జిల్లా అధికారులంతా కష్టపడి పని చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి, సమిష్టిగా నూతనోత్తేజంతో పనిచేద్దామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ను జిల్లా అధికారులు, రెవిన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సరం వేడుకలు.





( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో అధితి గృహంలో టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి మరియు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సరం 2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు వైకుంఠం అభిమానుల సమక్షంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గ ప్రజలు అష్టైశ్వర్యాలతో, సుఖ, సంతోషాలతో జీవితం గడపాలని భగవంతున్ని వేడుకున్నారు. నాయకులు కార్యకర్తల మధ్య కేక్ ను కట్ చేసి, నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, రైతులకు, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైకుంఠం అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## టీడిపి ప్రవేశపెట్టిన పథకాలు, సూపర్ సిక్స్...

– సూపర్ హిట్. ఆలూరు టీడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి.



( ఆలూరు మనగళం ):కర్నూలు జిల్లా, ఆలూరు మండల కేంద్రంలో అధితి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి. ఆలూరు నియోజవర్గంలో అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు అభివృద్ధి పనులను మీడియాకు తెలిపారు. అలాగే ఆలూరు టీడీపి ఇంచార్జ్ గా భాద్యతలు చేపట్టిన నాటి నుండి మూడు నెలల్లో ఆలూరుకు తెచ్చిన నిధులు గురించి వివరించారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లను పంపిణీ చేశారు. గతంలో 3 వేలు ఇచ్చే పెన్షన్ ను చంద్రబాబు ఏకంగా నాలుగు వేలకు, వికలాంగులకు 6 వేలు చేశారని అన్నారు. అలాగే తల్లికి వందనం పథకం కూడా ఇంట్లో ఒకరికి ఇచ్చేవారని టీడీపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంతమంది ఉంటే అంత మందికి ఇచ్చారు. సిసి రోడ్లు, బళ్లారి, కర్నూలు జాతీయ రహదారి మరమ్మతులు కు, మండల కేంద్రాల నుండి గ్రామాలకు లింక్ రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయ భాస్కర్, రాజశేఖర్ గౌడ్, శీనప్ప లు పాల్గొన్నారు.

## ఏసీ, ఫ్రిజ్ ధరలు పెరిగే అవకాశం..



హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం : కొత్త సంవత్సరం ప్రారంభంతో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన పలు నిబంధనలు సామాన్య వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గృహోపకరణాల విభాగంలో చోటుచేసుకున్న మార్పులు త్వరలో ధరల పెరుగుదలకు దారి తీయనున్నాయని నిపుణులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో సంబంధిత అధికార సంస్థ కొత్త ప్రమాణాలను అమలు చేయడంతో ఏసీలు, ఫ్రిజ్‌ల తయారీ ఖర్చు పెరగనుందని అంచనా వేస్తున్నారు.కొత్త నిబంధనల ప్రకారం శక్తి సామర్థ్య రేటింగ్ ప్రమాణాలను మరింత కఠినతరం చేశారు. ఇప్పటివరకు అత్యుత్తమ రేటింగ్‌గా ఉన్న ఉపకరణాలు ఇకపై తక్కువ రేటింగ్ కేటగిరీల్లోకి వెళ్లనున్నాయి. దీంతో తయారీదారులు మళ్లీ ఉన్నత రేటింగ్ సాధించాలంటే అదనపు సాంకేతిక మార్పులు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ముడి సరుకులు, డిజైన్ మార్పులు, తయారీ ఖర్చులు పెరగడం తప్పదని పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఈ అదనపు ఖర్చును కంపెనీలు పూర్తిగా భరించే పరిస్థితి లేకపోవడంతో, దాని భారాన్ని వినియోగదారులపై మోపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఫలితంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు సుమారు 5 వరకు పెరిగే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. వేసవి కాలానికి ముందు డిమాండ్ పెరిగే సమయంలో ఈ ధరల పెరుగుదల మరింత స్పష్టంగా కనిపించవచ్చని అంచనా.అయితే మరోవైపు, ఈ నిబంధనల వల్ల దీర్ఘకాలంలో వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. శక్తి సామర్థ్యం మెరుగుపడటం వల్ల విద్యుత్ వినియోగం తగ్గి, నెలవారీ బిల్లులు కొంత మేర నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. తాత్కాలికంగా ధరలు పెరిగినా, దీర్ఘకాలంలో పొదుపు దిశగా ఈ మార్పులు ఉపయోగపడతాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇప్పటికే కొనుగోలు చేసేందుకు ఆలోచిస్తున్న వినియోగదారులు ధరల పెరుగుదలకు ముందే నిర్ణయం తీసుకుంటే కొంత వరకు లాభపడే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి. కొత్త నిబంధనల అమలుతో గృహోపకరణాల మార్కెట్‌లో రాబోయే రోజుల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.ం

## తాజ్ జీవీకే హోటల్స్‌లో షాలిని భూపాల్ భారీ షేర్ కొనుగోలు

హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం : హోటల్ రంగంలో ప్రముఖ సంస్థగా పేరొందిన తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. కంపెనీ ప్రమోటర్ వాటాదారులలో ఒకరైన షాలిని భూపాల్ పెద్ద మొత్తంలో ఈక్విటీ షేర్లను సొంతం చేసుకోవడంతో యాజమాన్య నిర్మాణంలో స్పష్టమైన మార్పు వచ్చింది. ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ వద్ద ఉన్న వాటాను ఆమె కొనుగోలు చేయడంతో ఈ లావాదేవీ కార్పొరేట్ వర్గాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది.మంగళవారం జరిగిన ఈ డీల్‌లో మొత్తం 1.60 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కో షేరు రూ.370 ధరకు కొనుగోలు చేశారు. దీంతో ఈ లావాదేవీ విలువ సుమారు రూ.592 కోట్లకు చేరింది. ఈ కొనుగోలు అనంతరం తాజ్ జీవీకే హోటల్స్ సంస్థలో షాలిని భూపాల్ వాటా 25.52 శాతానికి పెరిగింది. ఈ షేర్ల బదిలీ మొత్తం ప్రమోటర్ గ్రూప్ సంస్థల మధ్యే జరిగినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. అందువల్ల దీనిని అంతర్గత వాటాల బదిలీగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు.



మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

# సంపాదకీయం

## సైన్స్ ఫిక్షన్ దినోత్సవం నేటి ఊహలే రేపటి ప్రపంచానికి పునాది

సైన్స్ ఫిక్షన్ అనగానే చాలామందికి అది కల్పిత ప్రపంచం, అసాధ్యమైన కథలు, వాస్తవానికి దూరమైన ఊహలుగా మాత్రమే అనిపిస్తుంది. కానీ నిజానికి సైన్స్ ఫిక్షన్ అనేది మానవ జ్ఞాన వికాసానికి దారి చూపిన శక్తివంతమైన ఆలోచనా ప్రవాహం. భవిష్యత్ శాస్త్రం, సాంకేతికత, అంతరిక్షం, మానవ జీవన విధానాలపై ముందస్తు ప్రశ్నలు వేస్తూ, సమాజాన్ని ఆలోచింపజేసే వేదికే సైన్స్ ఫిక్షన్. అలాంటి సైన్స్ ఫిక్షన్‌కు అంకితమైన ఈ దినం మన ఊహాశక్తి విలువను మరోసారి గుర్తు చేస్తుంది.ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, నేడు మనం సహజంగా వాడుతున్న అనేక సాంకేతిక సాధనాలు ఒకనాడు సైన్స్ ఫిక్షన్ కథలలో మాత్రమే ఉన్నాయి. మనుషులు అంతరిక్షంలోకి వెళ్లడం, భూమికి బయట జీవం ఉండే అవకాశాలు, చేతిలో ఉన్న పరికరాలతో ప్రపంచంతో మాట్లాడటం, యంత్రాలు మనిషి ఆలోచనలను అర్థం చేసుకోవడం ఇవన్నీ ఒకప్పుడు కలలుగా కనిపించాయి. కానీ ఆ కలలను ఊహించిన రచయితలు, ఆలోచించిన మేధావులే రేపటి శాస్త్రవేత్తలకు మార్గదర్శకులయ్యారు. ఊహించడమే ఆవిష్కరణకు తొలి మెట్టు అనే సత్యాన్ని సైన్స్ ఫిక్షన్ పదే పదే నిరూపించింది.సైన్స్ ఫిక్షన్ రచనలు, సినిమాలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదు. అవి సమాజానికి అద్దంలాంటివి. రాబోయే కాలంలో మానవ సమాజం ఎటు వెళ్తుంది? సాంకేతిక పురోగతి మనిషిని శక్తివంతం చేస్తుందా, లేక బలహీనపరుస్తుందా? యంత్రాలపై అధిక ఆధారపడటం మానవ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎలా ఉంటుంది? వంటి ప్రశ్నలను సైన్స్ ఫిక్షన్ మన ముందుంచుతుంది. సమాధానాలు ఇవ్వకపోయినా, ఆలోచించాల్సిన బాధ్యతను మన మీద వేస్తుంది.ప్రత్యేకంగా యువతకు సైన్స్ ఫిక్షన్ ఒక శక్తివంతమైన ప్రేరణ. పాఠ్యపుస్తకాల్లోని సూత్రాలు ఒక వైపు ఉంటే, వాటిని జీవితంతో అనుసంధానించి చూపించే పని సైన్స్ ఫిక్షన్ చేస్తుంది. “ఇలా అయితే ఎలా ఉంటుంది?” అనే ప్రశ్నతో మొదలయ్యే ప్రయాణమే శాస్త్రీయ దృష్టిని పెంపొందిస్తుంది. ఈ ప్రశ్నల నుంచే రేపటి ఇంజినీర్, శాస్త్రవేత్త, పరిశోధకుడు పుడతాడు. ఒక కథ చదివి, ఒక సినిమా చూసి, ఒక ఆలోచనతో ప్రేరణ పొందిన యువకుడు భవిష్యత్తులో ప్రపంచాన్ని మార్చే ఆవిష్కరణకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది.అయితే, సైన్స్ ఫిక్షన్ మనకు కేవలం ఆశలను మాత్రమే కాదు, హెచ్చరికలను కూడా ఇస్తుంది. నియంత్రణ లేని సాంకేతిక అభివృద్ధి, మానవ విలువల పతనం, పర్యావరణ వినాశనం, యుద్ధాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ముందుగానే చూపించి అప్రమత్తం చేస్తుంది. శాస్త్రం మన సేవకుడిగా ఉండాలి, అధిపతిగా మారితే ప్రమాదమనే సందేశాన్ని బలంగా నాటుతుంది. సాంకేతిక పురోగతితో పాటు మానవత, నైతిక విలువలు కూడా సమానంగా ముందుకు సాగాలనే ఆలోచనను సైన్స్ ఫిక్షన్ మనకు అందిస్తుంది.నేటి ప్రపంచంలో కృత్రిమ మేధస్సు, స్వయంచాలక యంత్రాలు, డేటా ఆధారిత నిర్ణయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సైన్స్ ఫిక్షన్ పాత్ర మరింత కీలకం అవుతుంది. ఎందుకంటే ఇది కేవలం “ఏం చేయగలం?” అనే ప్రశ్నను మాత్రమే కాదు, “ఏం చేయాలి?”, “ఏం చేయకూడదు?” అనే ప్రశ్నలను కూడా ముందుకు తెస్తుంది. భవిష్యత్తును అంధంగా స్వాగతించకుండా, ఆలోచించి అడుగులు వేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.సైన్స్ ఫిక్షన్ దినోత్సవం సందర్భంగా మనం చేసుకోవాల్సినది ఒక్కటే ఊహించడాన్ని తక్కువగా చూడకూడదు. ప్రశ్నించడం తప్పు అనుకోకూడదు. కొత్త ఆలోచనలకు స్థానం ఇవ్వాలి. పుస్తకాలను చదవాలి, ఆలోచనలను పంచుకోవాలి, భవిష్యత్తుపై చర్చ జరగాలి. ఎందుకంటే నేటి ఊహలే రేపటి వాస్తవాలుగా మారతాయి. భవిష్యత్తు ఎవరో రాసి పెట్టిన కథ కాదు; మన ఆలోచనలే దానికి కథా వస్తువు.సైన్స్ ఫిక్షన్ అనేది కల్పిత ప్రపంచం కాదు. అది రాబోయే కాలానికి మనం రాసుకునే ముందుమాట. ఆ ముందుమాట ఎంత బలంగా, బాధ్యతతో ఉంటేడ రేపటి ప్రపంచం అంత అందంగా, సమతుల్యంగా ఉంటుంది.


సైన్స్ ఫిక్షన్ అనగానే చాలామందికి అది కల్పిత ప్రపంచం, అసాధ్యమైన కథలు, వాస్తవానికి దూరమైన ఊహలుగా మాత్రమే అనిపిస్తుంది. కానీ నిజానికి సైన్స్ ఫిక్షన్ అనేది మానవ జ్ఞాన వికాసానికి దారి చూపిన శక్తివంతమైన ఆలోచనా ప్రవాహం. భవిష్యత్ శాస్త్రం, సాంకేతికత, అంతరిక్షం, మానవ జీవన విధానాలపై ముందస్తు ప్రశ్నలు వేస్తూ, సమాజాన్ని ఆలోచింపజేసే వేదికే సైన్స్ ఫిక్షన్. అలాంటి సైన్స్ ఫిక్షన్‌కు అంకితమైన ఈ దినం మన ఊహాశక్తి విలువను మరోసారి గుర్తు చేస్తుంది.ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, నేడు మనం సహజంగా వాడుతున్న అనేక సాంకేతిక సాధనాలు ఒకనాడు సైన్స్ ఫిక్షన్ కథలలో మాత్రమే ఉన్నాయి. మనుషులు అంతరిక్షంలోకి వెళ్లడం, భూమికి బయట జీవం ఉండే అవకాశాలు, చేతిలో ఉన్న పరికరాలతో ప్రపంచంతో మాట్లాడటం, యంత్రాలు మనిషి ఆలోచనలను అర్థం చేసుకోవడం ఇవన్నీ ఒకప్పుడు కలలుగా కనిపించాయి. కానీ ఆ కలలను ఊహించిన రచయితలు, ఆలోచించిన మేధావులే రేపటి శాస్త్రవేత్తలకు మార్గదర్శకులయ్యారు. ఊహించడమే ఆవిష్కరణకు తొలి మెట్టు అనే సత్యాన్ని సైన్స్ ఫిక్షన్ పదే పదే నిరూపించింది.సైన్స్ ఫిక్షన్ రచనలు, సినిమాలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదు. అవి సమాజానికి అద్దంలాంటివి. రాబోయే కాలంలో మానవ సమాజం ఎటు వెళ్తుంది? సాంకేతిక పురోగతి మనిషిని శక్తివంతం చేస్తుందా, లేక బలహీనపరుస్తుందా? యంత్రాలపై అధిక ఆధారపడటం మానవ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎలా ఉంటుంది? వంటి ప్రశ్నలను సైన్స్ ఫిక్షన్ మన ముందుంచుతుంది. సమాధానాలు ఇవ్వకపోయినా, ఆలోచించాల్సిన బాధ్యతను మన మీద వేస్తుంది.ప్రత్యేకంగా యువతకు సైన్స్ ఫిక్షన్ ఒక శక్తివంతమైన ప్రేరణ. పాఠ్యపుస్తకాల్లోని సూత్రాలు ఒక వైపు ఉంటే, వాటిని జీవితంతో అనుసంధానించి చూపించే పని సైన్స్ ఫిక్షన్ చేస్తుంది. “ఇలా అయితే ఎలా ఉంటుంది?” అనే ప్రశ్నతో మొదలయ్యే ప్రయాణమే శాస్త్రీయ దృష్టిని పెంపొందిస్తుంది. ఈ ప్రశ్నల నుంచే రేపటి ఇంజినీర్, శాస్త్రవేత్త, పరిశోధకుడు పుడతాడు. ఒక కథ చదివి, ఒక సినిమా చూసి, ఒక ఆలోచనతో ప్రేరణ పొందిన యువకుడు భవిష్యత్తులో ప్రపంచాన్ని మార్చే ఆవిష్కరణకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది.అయితే, సైన్స్ ఫిక్షన్ మనకు కేవలం ఆశలను మాత్రమే కాదు, హెచ్చరికలను కూడా ఇస్తుంది. నియంత్రణ లేని సాంకేతిక అభివృద్ధి, మానవ విలువల పతనం, పర్యావరణ వినాశనం, యుద్ధాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ముందుగానే చూపించి అప్రమత్తం చేస్తుంది. శాస్త్రం మన సేవకుడిగా ఉండాలి, అధిపతిగా మారితే ప్రమాదమనే సందేశాన్ని బలంగా నాటుతుంది. సాంకేతిక పురోగతితో పాటు మానవత, నైతిక విలువలు కూడా సమానంగా ముందుకు సాగాలనే ఆలోచనను సైన్స్ ఫిక్షన్ మనకు అందిస్తుంది.నేటి ప్రపంచంలో కృత్రిమ మేధస్సు, స్వయంచాలక యంత్రాలు, డేటా ఆధారిత నిర్ణయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సైన్స్ ఫిక్షన్ పాత్ర మరింత కీలకం అవుతుంది. ఎందుకంటే ఇది కేవలం “ఏం చేయగలం?” అనే ప్రశ్నను మాత్రమే కాదు, “ఏం చేయాలి?”, “ఏం చేయకూడదు?” అనే ప్రశ్నలను కూడా ముందుకు తెస్తుంది. భవిష్యత్తును అంధంగా స్వాగతించకుండా, ఆలోచించి అడుగులు వేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.సైన్స్ ఫిక్షన్ దినోత్సవం సందర్భంగా మనం చేసుకోవాల్సినది ఒక్కటే ఊహించడాన్ని తక్కువగా చూడకూడదు. ప్రశ్నించడం తప్పు అనుకోకూడదు. కొత్త ఆలోచనలకు స్థానం ఇవ్వాలి. పుస్తకాలను చదవాలి, ఆలోచనలను పంచుకోవాలి, భవిష్యత్తుపై చర్చ జరగాలి. ఎందుకంటే నేటి ఊహలే రేపటి వాస్తవాలుగా మారతాయి. భవిష్యత్తు ఎవరో రాసి పెట్టిన కథ కాదు; మన ఆలోచనలే దానికి కథా వస్తువు.సైన్స్ ఫిక్షన్ అనేది కల్పిత ప్రపంచం కాదు. అది రాబోయే కాలానికి మనం రాసుకునే ముందుమాట. ఆ ముందుమాట ఎంత బలంగా, బాధ్యతతో ఉంటేడ రేపటి ప్రపంచం అంత అందంగా, సమతుల్యంగా ఉంటుంది.

# ఆలూరు నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.




– ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బి. వీరుపాక్షి

( ఆలూరు మనగళం ):ఆలూరు వైసీపీ ఏమ్మెల్యే బుసినే విరుపాక్షి, తనయుడు వైసీపీ యువనేత రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ బుసినే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వీరుపాక్షి మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, రైతులకు, మీడియా మిత్రులకు హృదయపూర్వకమైన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆయురారోగ్యాలు, ఆనందం, శాంతి, సుఖసంతోషాలు పుష్కలంగా దేవుడు ప్రసాధించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# ఆదోని జిల్లా కోసం ఆదిమానవుడి వేషధారణలో సామాజిక కార్యకర్త కమలకర్ నాయుడు.

( ఆలూరు మనగళం ):ఆదోని జిల్లా చేయాలంటూ సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు తో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆదిమానవుడి వేషధారణలో జిఎస్టి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ లో నిర్వహిస్తున్న 21వ రోజు రిలే దీక్షలో ఆయన కూర్చున్నారు. వీరికి మద్దతుగా ఆలూరు జె ఏ సి నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్, ఎల్లప్ప, దాద భాష, పూల రామాంజనేయులు, బంగారు రామకృష్ణ యాదవ్, హనుమంతు కూర్చున్నారు. ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లాగా ప్రకటించాలన్నారు. ఇందుకోసం 5 నియోజవర్గ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రజల ఆకాంక్ష ను వినిపించాలన్నారు. లేదంటే దంపతులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు ఆదోని జె ఏ సి నాయకులు వీరేష్, ఆలూరు సిపిఐ నాయకులు రామాంజినేయులు, బుడగ జంగాల సంఘం నాయకులు సిరివాటి మహేంద్ర, ఏపీయూడబ్ల్యూజే నాయకులు స్వరూప్, చంద్రబాబు, డానియల్, వీర వీరేష్, అధ్యాపకులు బాలకృష్ణ సంఘీభావం ప్రకటించారు.



# ఫిబ్రవరి 1 నుంచి సిగరెట్లు, బీడీలు, పాన్‌మసాలా ధరలు పెంపు

న్యూఢిల్లీ జనవరి 1, 2026 మనగళం : సామాన్యులపై మరో భారం పడనుంది. సిగరెట్లు, బీడీలు, పాన్‌మసాలా ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ఉత్పత్తులపై ప్రస్తుతం అమల్లో ఉన్న పన్నులతో పాటు అదనపు సుంకాలు విధించనుండటంతో ఫిబ్రవరి 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. పొగాకు వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యపరమైన నష్టాలను నియంత్రించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పాన్‌మసాలా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై అధిక శాతం పన్నులు విధించనున్నారు. బీడీలపై కూడా ప్రత్యేకంగా పన్ను భారం పెరుగనుంది. అంతేకాకుండా పాన్‌మసాలాపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రత పేరుతో ప్రత్యేక సెస్ అమలు చేయనున్నారు. గతంలో ఉన్న పరిహార సెస్ స్థానంలో ఈ కొత్త సెస్ అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. దీంతో పాన్‌మసాలా ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఇదే సమయంలో చూయింగ్ పొగాకు, జర్దా, గుట్కా వంటి ఉత్పత్తుల తయారీకి ఉపయోగించే యంత్రాలపై కూడా కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. యంత్రాల సామర్థ్యాన్ని బట్టి సుంకాలు వసూలు చేసే విధానాన్ని మరింత కఠినతరం చేశారు. దీని వల్ల తయారీదారులపై అదనపు భారం పడనుండగా, ఆ భారాన్ని వినియోగదారులపై మళ్లించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.ఈ మార్పులకు సంబంధించిన బిల్లులను డిసెంబర్ నెలలోనే పార్లమెంట్ ఆమోదించింది. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ నిర్ణయాలతో పొగాకు ఉత్పత్తుల వినియోగం తగ్గుతుందని, ప్రజారోగ్య పరిరక్షణకు ఇది దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది. అయితే ధరల పెంపుతో చిరు వ్యాపారులు, తక్కువ ఆదాయ వర్గాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.




# దేశవ్యాప్తంగా భారత్ టాక్సీ సేవలు ప్రారంభం

హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం : ప్రజలకు చౌకగా, సులభంగా ప్రయాణ సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నేటి నుంచే దేశవ్యాప్తంగా భారత్ టాక్సీ సేవలను ప్రారంభించింది. అధిక చార్జీలు, తరచూ రైడ్లు రద్దు కావడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు ఇది పెద్ద ఊరటగా మారనుంది. ఇప్పటికే కొన్ని నగరాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ సేవలు మంచి స్పందన రావడంతో, ఇప్పుడు దేశమంతటా విస్తరిస్తున్నారు.భారత్ టాక్సీ యాప్ ద్వారా బైక్, ఆటో, కారు సేవలను బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రైవేట్ రైడ్ యాప్‌లలో డ్రైవర్లు రైడ్‌లను రద్దు చేయడం, అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్న నేపథ్యంలో, వాటికి ప్రత్యామ్నాయంగా ఈ ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారు. తక్కువ ధరలతో పాటు పారదర్శక విధానంలో సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటోంది.డ్రైవర్లను ఎక్కువ సంఖ్యలో ఈ ప్లాట్‌ఫామ్‌లో చేరేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల డ్రైవర్లకు ఎక్కువ బుకింగ్స్ రావడం, ఆదాయం పెరగడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ప్రయాణికులకు వేగంగా బుకింగ్ లభించి, తక్కువ ఖర్చుతో గమ్యానికి చేరుకునే అవకాశం ఉంటుంది.సేవల నాణ్యతను మెరుగుపరచడం, యాప్‌ను సజావుగా నడపడం ద్వారా భారత్ టాక్సీ సేవలు ప్రజల్లో విశ్వాసం సంపాదిస్తే, ప్రైవేట్ రైడ్ సేవలకు గట్టి పోటీగా నిలుస్తాయని అంచనా వేస్తున్నారు. నేటి నుంచి ప్రారంభమైన ఈ సేవలు రాబోయే రోజుల్లో ప్రజా రవాణా రంగంలో కీలక మార్పుకు దారి తీసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# నంద్యాల జిల్లా అభివృద్ధికి కృషి


– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




మనగళం, నంద్యాల: ఆంగ్ల నూతన సంవత్సరం 2026 సందర్భంగా గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా సర్వోన్నత అధికారి రాజకుమారి గణియాను జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ తిరిగి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గత సంవత్సరంలో జిల్లాలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను గుర్తు చేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికారులు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నూతన సంవత్సరం 2026లో నంద్యాల జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకువెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన, సమర్థవంతమైన సేవల అందింపు దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ పరిపాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సత్వర సేవలు అందించాలన్నారు. భూ సమస్యల పరిష్కారం, రీ–సర్వే ప్రక్రియ, భూ హక్కుల పరిరక్షణ, పెన్షన్లు, గృహ నిర్మాణం, ఉపాధి కల్పన వంటి అంశాలలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే గ్రామీణ అభివృద్ధి, పట్టణ సౌకర్యాల విస్తరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల్లో గుణాత్మక మార్పులు



తీసుకురావాలని కోరారు. "ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధికి పునాది" అని పేర్కొన్న జిల్లా కలెక్టర్, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ప్రతి ఉద్యోగి ప్రజలతో సానుకూలంగా మెలిగి, సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించే దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. ఈ నూతన సంవత్సరంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే నంద్యాల జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిదీనని గుర్తు చేస్తూ, 2026 సంవత్సరం నంద్యాల జిల్లాకు సుభిక్షం, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కలిగిన సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు.



# డిసెంబర్ 31న తెలంగాణలో రికార్డు స్థాయి మద్యం అమ్మకాలు



హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం : నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31న తెలంగాణ రాష్ట్రంలో మద్యం అమ్మకాలు భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఆ రోజు రాత్రి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్బులు జనంతో కిక్కిరిసిపోయాయి. నగరాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా మందుబాబుల సందడి కనిపించింది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు అనుమతి ఇచ్చింది. దీంతో రాత్రంతా మద్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగాయి.ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.5000 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాది నూతన సంవత్సరం వేడుకలతో పోలిస్తే ఈసారి అమ్మకాలు మరింత పెరిగాయని అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.1000 కోట్ల మేర అదనపు అమ్మకాలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు.డిసెంబర్ 31 రాత్రి జరిగిన మొత్తం అమ్మకాల పూర్తి లెక్కలు ఇంకా వెలువడాల్సి ఉంది. అవి బయటకు వస్తే ఈసారి మద్యం విక్రయాలు ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల అమలులోకి వచ్చిన మద్యం విధాన మార్పులే ఈ భారీ అమ్మకాలకు ప్రధాన కారణమని ఎక్సైజ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# లావాదేవీలు లేని బ్యాంక్ ఖాతాలపై ఆర్‌బీఐ అలర్ట్

హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం, నూతన సంవత్సరం ప్రారంభంతో బ్యాంక్ ఖాతాదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక హెచ్చరిక జారీ చేసింది. ఎక్కువ కాలంగా ఎలాంటి లావాదేవీలు లేకుండా వాడకంలో లేని బ్యాంక్ ఖాతాలను గుర్తించి మూసివేసే ప్రక్రియను బ్యాంకులు ప్రారంభించనున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ మోసాలు, అక్రమ లావాదేవీలను అరికట్టడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని ఆర్‌బీఐ వర్గాలు వెల్లడించాయి.ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం రెండు సంవత్సరాలుగా ఎలాంటి డిపాజిట్లు లేదా విత్‌డ్రాయల్స్ లేని డోర్మెంట్ ఖాతాలు మూసివేతకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే 12 నెలలుగా వాడని ఇన్‌యాక్టివ్ ఖాతాలపై కూడా బ్యాంకింగ్ సేవలను పరిమితం చేసే అవకాశం ఉందని సమాచారం. దీర్ఘకాలంగా జీరో బ్యాలెన్స్‌తో ఉండి కేవైసీ వివరాలు అప్‌డేట్ చేయని ఖాతాలపై కూడా బ్యాంకులు చర్యలు తీసుకునే వీలుంది.వాడుకలో లేని ఖాతాల ద్వారా మోసాలు జరుగుతున్నాయని గుర్తించిన ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. పారదర్శకత పెంచడం, ఖాతాదారుల డేటాను రక్షించడం కూడా ఈ చర్యల లక్ష్యమని పేర్కొంది.ఈ నేపథ్యంలో ఖాతాదారులు తమ బ్యాంక్




ఖాతాలు యాక్టివ్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న మొత్తంలో అయినా లావాదేవీ చేయడం, యూపీఐ ద్వారా చెల్లింపులు లేదా ఏటీఎం ద్వారా నగదు ఉపసంహరణ చేయడం సరిపోతుందని తెలిపారు. అలాగే కేవైసీ వివరాలు పూర్తిగా అప్‌డేట్‌లో ఉన్నాయో లేదో బ్యాంకులో నిర్ధారించుకోవాలని ఆర్‌బీఐ సూచిస్తోంది.

# జనవరి 1న మళ్లీ పెరిగిన బంగారం ధరలు..



హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం : కొత్త సంవత్సరం తొలి రోజునే బంగారం ధరలు మళ్లీ పైబాట పట్టాయి. గత మూడు రోజులుగా కొనసాగిన తగ్గుదల ధోరణికి బ్రేక్ పడుతూ గురువారం పసిడి ధర స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, వడ్డీ రేట్లపై అంచనాల నేపథ్యంలో బంగారంపై మళ్లీ డిమాండ్ పెరుగుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.నేటి ఉదయం సమయానికి 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ.1,35,060కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ఇది స్వల్ప పెరుగుదలగా నమోదైంది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.1,23,800గా ఉంది. వరుసగా ధరలు పెరుగుతున్న తీరును చూస్తుంటే రాబోయే రోజుల్లో పసిడి మరింత బలపడే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.అయితే వెండి ధరలో మాత్రం తగ్గుదల కనిపించింది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే సుమారు రూ.1,000 మేర తగ్గి రూ.2,38,000 వద్దకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లోని ఒడిదుడుకులు, పరిశ్రమల డిమాండ్‌లో మార్పులు వెండి ధరపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.మొత్తానికి కొత్త ఏడాది ఆరంభంలోనే బంగారం మళ్లీ ఎగబాకడం ప్రారంభించడంతో, ఇకపై ధరల దరువు మొదలవుతుందా అనే చర్చ వినియోగదారుల్లో మొదలైంది. పెళ్లిళ్ల సీజన్, పెట్టుబడి డిమాండ్ నేపథ్యంలో రాబోయే రోజుల్లో పసిడి ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# 2026 వేసవిలో ప్రేమ కథతో బరిలోకి కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ'

హైదరాబాద్ జనవరి 1, 2026 మనగళం, టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తూ తనదైన గుర్తింపును బలపరుచుకుంటున్నారు. ఆయన కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ'ను 2026 వేసవి కానుకగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం నూతన సంవత్సర సందర్భంగా ప్రకటించింది. ప్రేమకథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'బేబీ' చిత్రం తర్వాత దర్శకుడు సాయి రాజేష్ ఈ సినిమాకు కథ అందించడమే కాకుండా నిర్మాతగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాస్ మూవీ మేకర్స్ పతాకంపై ఎస్‌కేఎన్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమాకు రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా, 'మ్యాడ్', 'లవర్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న శ్రీ గౌరి ప్రియ హీరోయిన్‌గా కిరణ్ అబ్బవరంతో జతకడుతోంది. చెన్నై నేపథ్యంగా సాగే ఈ ప్రేమ కథలో యువతను ఆకట్టుకునే భావోద్వేగాలు, వినోదాత్మక అంశాలు సమపాళ్లలో ఉంటాయని చిత్రబృందం చెబుతోంది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తుండటంతో పాటలపై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లోని నేపథ్య సంగీతం, విజువల్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజా ప్రకటనతో వేసవి సీజన్‌లో ప్రేమకథల అభిమానులకు ఈ చిత్రం




ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## పోలీస్ స్మరణ దినం విధి ముందు ప్రాణాలు లెక్కచేయని త్యాగాల జ్ఞాపకం

డెస్క్, జనవరి 1 మనగళం :సమాజం ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న ప్రతి క్షణం వెనుక, ఎవరో ఒకరు అప్రమత్తంగా కాపలాగా నిలబడి ఉంటారు. ఆ కనిపించని కాపలాదారులే పోలీసులు. ప్రజల ప్రాణాలు, ఆస్తి, గౌరవాన్ని కాపాడేందుకు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ సిబ్బందిని స్మరించుకునే రోజే పోలీస్ స్మరణ దినం. కొన్ని దేశాల్లో అధికారికంగా నిర్వహించే ఈ దినం, భద్రత అనేది సహజంగా లభించే విషయం కాదని, ఎన్నో త్యాగాల ఫలితమని గుర్తు చేస్తుంది.పోలీసు వృత్తి ఒక సాధారణ ఉద్యోగం కాదు. అది నిరంతర అప్రమత్తతతో కూడిన జీవితం. రాత్రిపగలు అనే తేడా లేకుండా, వర్షం, ఎండ, చలి అన్నీ లెక్కచేయకుండా విధుల్లో ఉండాల్సిన బాధ్యత. నేరస్తులను ఎదుర్కొనడం, అల్లర్లు నియంత్రించడం, ఉగ్రవాదాన్ని అడ్డుకోవడం, విపత్తుల సమయంలో ప్రాణాలను కాపాడడం ప్రతి క్షణం ప్రాణాలకు ముప్పు ఉన్న పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తుంది. ఈ క్రమంలో అనేక మంది పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ప్రాణాలను కోల్పోయారు. వారి త్యాగమే నేటి శాంతికి పునాది.పోలీస్ స్మరణ దినం మన సమాజానికి ఒక అద్దంలాంటిది. భద్రతను మనం ఎంత తేలికగా తీసుకుంటున్నామో ఆలోచింపజేస్తుంది. రోడ్లపై నిర్భయంగా తిరగగలగడం, పండుగలు ఆనందంగా జరుపుకోవడం, పిల్లలు పాఠశాలలకు సురక్షితంగా వెళ్లడం ఇవన్నీ పోలీసుల అప్రమత్తత వల్లనే సాధ్యమవుతున్నాయి. కానీ ఆ అప్రమత్తతకు చెల్లించాల్సిన ధర చాలాసార్లు ఒక ప్రాణం. ఆ కుటుంబం ఎదుర్కొనే శూన్యతను, బాధను సమాజం ఎంతవరకు గుర్తిస్తోంది అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది.పోలీసులపై విమర్శలు చేయడం సులభం. ఒక చిన్న తప్పిదం జరిగినా వేలి చూపు ముందుగా పోలీసుల వైపే ఉంటుంది. కానీ వారి విధుల్లోని ఒత్తిడి, మానసిక భారం, పని గంటల అసమానతలు, కుటుంబాలకు దూరంగా గడిపే జీవితం గురించి ఆలోచించేవారు చాలా తక్కువ. నిరంతరం ప్రమాదంలో జీవిస్తూ కూడా, విధి పట్ల నిబద్ధతతో ముందుకు సాగడం సాధారణ విషయం కాదు. ఆ నిబద్ధతే పోలీస్ వృత్తిని ప్రత్యేకంగా నిలబెడుతుంది.ఈ దినం మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తుంది పోలీస్ ప్రజల మధ్య విశ్వాసం ఎంత కీలకమో. ప్రజల సహకారం లేకుండా చట్టసువ్యవస్థ నిలబడదు. చట్టాన్ని గౌరవించడం, పోలీసులకు సహకరించడం, నిబంధనలను పాటించడం ద్వారా మాత్రమే శాంతియుత సమాజాన్ని నిర్మించగలం.

## వ్యాయామం ఆరోగ్యానికి గొప్ప వరం?



మనగళం **ఆరోగ్యం :** ప్రతి ఒక్కరూ కూడా ఆరోగ్యకరమైన ఇంకా సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఇంకా అలాగే సాధ్యమైనంత ఎక్కువ కాలం తమ వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయాలని కోరుకుంటారు.అయితే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అనేది మాత్రం జీవితకాలంలో మనం అలవర్చుకోగల ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. ఈ వ్యాయామం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, చాలా దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేస్తుంది. రెగ్యులర్ వ్యాయామాలు మెదడు ఆరోగ్యానికి కూడా చాలా సహాయపడతాయి. డిప్రెషన్, డిమెన్షియా ఇంకా అల్జీమర్స్ వ్యాధి వంటి మానసిక ఆరోగ్య సమస్యలను కూడా చాలా దూరంగా ఉంచవచ్చు. చురుకైన జీవనశైలితో ఇంకా వృద్ధాప్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవటం సాధ్యమవుతుంది.శారీరక శ్రమ అనేది ఖచ్చితంగా మన ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. అలాగే మానసిక స్థితికి నిద్ర నాణ్యత ఇంకా శక్తిని పెంచుతుంది.అలాగే నడవటం, సైక్లింగ్ చేయడానికి బయలుదేరినప్పుడు రోజులో నెలకొన్ని ఒత్తిడి తొలిగిపోతుంది. వ్యాయామం చేసే వ్యక్తులకు గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, స్ట్రోక్ ఇంకా కొన్ని క్యాన్సర్‌లు వచ్చే ప్రమాదం తక్కువగా ఉందని కొన్ని అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. ఇది ముందస్తు మరణం ప్రమాదాన్ని కూడా ఈజీగా తగ్గిస్తుంది. ఇంకా అలాగే వ్యాయామం అధిక ఒత్తిడిని దూరం చేస్తుంది. ఎందుకంటే వ్యాయామం చెయ్యడం వల్ల కార్టిసాల్ , ఒత్తిడి హార్మోన్ తగ్గుతుంది.వ్యాయామం అనేక విధాలుగా మన ఆరోగ్యానికి సహాయపడుతుంది. ఇది మీ గుండెను ఈజీగా రక్షిస్తుంది. గుండెపోటు ఇంకా స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.అలాగే ఇది వాపును తగ్గిస్తుంది. ఇంకా హార్మోన్లను సమతుల్యం చేస్తుంది, అందువలన రొమ్ము ఇంకా అలాగే ఇతర సాధారణ క్యాన్సర్లను ఈజీగా తగ్గిస్తుంది.వ్యాయామం ద్వారా రక్త ప్రసరణ కూడా బాగా పెరుగుతుంది. ఇక పెరిగిన సర్క్యులేషన్ వల్ల వచ్చే ఎక్కువ శక్తి అనేది స్థిరమైన వ్యాయామం లైంగిక జీవితాన్ని ఈజీగా ప్రేరేపించగలగుతుంది.వ్యాయామం వలన మెదడు చాలా మెరుగ్గా పని చేస్తుంది. వ్యాయామం జ్ఞాపకశక్తి, అభ్యాసం, ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది.

# కొలెస్ట్రాల్‌ను తొలగించే పానీయాలు



మనగళం **ఆరోగ్యం :** రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ ను తొలగించే పానీయాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో అల్లం ఇంకా నిమ్మరసం ఎంతగానో సహాయపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఎంతగానో సహాయపడతాయి. దీని కోసం ఒక గ్లాస్ లో ఒక టీ స్పూన్ అల్లం రసం ఇంకా ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఇలా తాగడం వల్ల రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ ఈజీగా తొలగిపోతుంది. అదే విధంగా ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలల్లో ఒక టీ స్పూన్ పసుపు వేసి రోజూ ఉదయం పూట పరగడుపున తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల పాలల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఇంకా యాంటీ ఆక్సిడెంట్లు రక్తంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఉపయోగపడతాయి.అలాగే కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో వెల్లుల్లి కూడా మనకు ఎంతో సహాయపడుతుంది. రక్తాన్ని పలుచగా చేసి రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో వెల్లుల్లి మనకు సహాయపడుతుంది. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ తేనె ఇంకా రెండు వెల్లుల్లి రెబ్బల చూర్ణాన్ని వేసి కలిపి పరగడుపున తాగాలి. ఇలా తాగడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఈజీగా తగ్గుతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఉసిరికాయ రసం కూడా బాగా తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఒక పెద్ద ఉసిరికాయ నుండి తీసిన రసాన్ని ఒక కప్పు నీటిలో కలిపి రోజూ ఉదయం పూట పరగడుపున తాగాలి. ఇలా తాగడం వల్ల ఖచ్చితంగా చాలా మంచి ఫలితం ఉంటుంది. అలాగే ఉసిరి, బిభితకీ, హరితకి అనే త్రిఫలాల నుండి తయారు చేసిన త్రిఫలా చూర్ణాన్ని తీసుకోవడం వల్ల కూడా కొలెస్ట్రాల్ స్థాయిలు ఖచ్చితంగా అదుపులో ఉంటాయి.ఒక కప్పు వేడి నీటిలో ఒక టీ స్పూన్ త్రిఫలా చూర్ణాన్ని వేసి 5 నుండి 10 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఆ తరువాత ఈ టీని వడకట్టి తాగాలి. ఇలా తాగడం వల్ల కూడా ఖచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ఇక అశ్వగంధ టీ ని తయారు చేసుకుని తాగడం వల్ల కూడా రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఈజీగా అదుపులో ఉంటాయి. ఒక కప్పు వేడి నీటిలో ఒక టీ స్పూన్ అశ్వగంధ పొడిని వేసి 5 నుండి 10 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఆ తరువాత ఈ టీని వడకట్టి పరగడుపున తాగాలి. ఇలా తాగడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఈజీగా అదుపులో ఉంటాయి. ఈ విధంగా ఈ పానీయాలను తయారు చేసుకుని తాగడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్యల నుండి చాలా ఈజీగా బయటపడవచ్చు.

# బొప్పాయి చెట్టు పెంచుతున్నారా..?

మనగళం **ఆరోగ్యం :** వాస్తు.. నేటి కాలంలో ప్రతి ఒక్కరి జీవితంలోనూ వాస్తు ప్రధాన అంశంగా మారింది. ఇల్లు, ఆఫీసు, పని చేసే ప్రదేశం అన్ని చోట్ల తప్పనిసరిగా వాస్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇల్లు ఏ దిక్కున నిర్మించుకోవాలి. ఇంట్లో ఏ వస్తువు ఎక్కడ పెట్టాలి. ఇంటి ముందు ఎలాంటి చెట్లు పెంచుకోవాలి. ఇంటి ప్రవేశ ద్వారాం, గేట్ దగ్గర ఎలా ఉండాలి..? ఎలాంటి మొక్కలు, చెట్లు పెంచుకోవచ్చు...? ఇలాంటి చాలా విషయాలు వాస్తు శాస్త్రంలో ప్రస్తావించబడ్డాయి. అయితే, ఇంటి ముందు బొప్పాయి చెట్టు పెంచితే ఏమవుతుందో తెలుసా..? ప్రతి ఒక్కరూ ఇంటిని అందంగా ఉంచుకోవటానికి ఇష్టపడుతుంటారు. ఇందులో భాగంగా చాలా మంది ఇంట్లో వివిధ రకాల మొక్కలు, చెట్లను నాటుతుంటారు. ఇంట్లో చెట్లు, మొక్కలు పెంచితే ఆ ఇంట్లో పాజిటివ్ ఎనర్జీ ప్రవాహిస్తుంది. కానీ, కొన్ని మొక్కలు ఇంటి ఆవరణలో పెంచకూడదని చెబుతుంటారు. అవి మీకు ప్రతికూల ఫలితాలను ఇస్తాయని నమ్ముతారు. అలాంటిదే బొప్పాయి చెట్టు. వాస్తు శాస్త్రం ప్రకారం.. బొప్పాయి చెట్టు ఇంటి ముందు ఉండటం మంచిది కాదని చెబుతారు. ఒకవేళ పొరపాటున ఎప్పుడైనా విత్తనం పడి చెట్టు మీ ఇంటి ముందు పెరిగితే ఆ మొక్కను పీకి వేరే చోట నాటాలని వాస్తు శాస్త్రనిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. ఇంటి ముందు బొప్పాయి చెట్టును నాటితే దాంతో మీరు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుందని చెబుతున్నారు. వాస్తు నిపుణులు చెబుతున్న మేరకు..ఇంటి ముందు బొప్పాయి చెట్టు పెంచటం వల్ల ఆ ఇంట్లో ప్రశాంతత, సంతోషాలు దూరం అవుతాయని అంటున్నారు. అందుకే ఇంటి ముందు బొప్పాయి చెట్టును నాటకూడదని అంటున్నారు. అయితే, దీని వెనుక ఓ బలమైన కారణం ఉందని చెబుతున్నారు. వాస్తు శాస్త్రం ప్రకారం.. బొప్పాయి చెట్టు పూర్వీకుల నివాసంగా భావిస్తారు. అందుకే ఈ చెట్టును ఇంటి దగ్గర, ఇంటి ముందు నాటకూడదని అంటున్నారు.. అంతేకాదు ఇంటి ముందు, ఇంటి ఆవరణలో బొప్పాయి మొక్కను నాటడం వల్ల పిల్లలకు ఎప్పుడూ బాధలు వస్తాయని అంటున్నారు. అందుకే ఇంటి ముందు బొప్పాయి చెట్టును నాటడం మంచిది కాదని అంటున్నారు. అంతేకాదు.. వాస్తు ప్రకారం.. ఇంటి చుట్టు ముట్టూ కూడా బొప్పాయి చెట్టును నాటకూడదని అంటున్నారు. ఎందుకంటే బొప్పాయి చెట్టు అశుభానికి సంకేతంగా భావిస్తారు. ఇంటి ఆవరణలో బొప్పాయి మొక్కను నాటితే ఇంట్లో ఎప్పుడూ డబ్బు కష్టాలు వెంటాడుతాయని చెబుతున్నారు. అంతేకాదు, ఇంట్లో ఎప్పుడూ గొడవలు, చికాకులు కలుగుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు.



## వన్డే జట్టు 2025 కెప్టెన్‌గా రోహిత్..



హైదరాబాద్ జనవరి 1, 2026 మన గళం, వన్డే క్రికెట్‌లో 2025 సంవత్సరానికి అత్యుత్తమంగా రాణించిన ఆటగాళ్లతో వన్డే జట్టు 2025ను ప్రకటించారు. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మకు ఈ జట్టుకు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. నిరుడు ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలిపిన రోహిత్, ఓపెనర్‌గా కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. టాప్ ఆర్డర్‌లో మరో భారత స్టార్ విరాట్ కోహ్లీ మూడో స్థానంలో నిలవగా, ఇంగ్లండ్ దిగ్గజం జో రూట్ నాలుగో స్థానంలో ఎంపికయ్యాడు.2025లో వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసిన ఆటగాళ్లతో ఈ జట్టును ఎంపిక చేశారు. ఓపెనర్‌గా రోహిత్‌కు జోడీగా దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ మాథ్యూ బ్రీట్జ్‌కు అవకాశం లభించింది. దక్షిణాఫ్రికాపై శతకాలతో ఆకట్టుకున్న కోహ్లీ మరోసారి తన స్థాయిని చాటడంతో టాప్ ఆర్డర్‌లో స్థానం నిలుపుకున్నాడు.విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ ఆటగాడు గ్లెన్ ఫిలిప్స్ ఆల్‌రౌండర్‌గా చోటు సంపాదించగా, మిచెల్ శాంట్నర్ జట్టుకు సమతుల్యత అందిస్తున్నాడు. బౌలింగ్ విభాగంలో న్యూజిలాండ్‌కు చెందిన మ్యాట్ హెన్రీ, ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్, ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, వెస్టిండీస్ బౌలర్ జైడెన్ సీల్స్ ఎంపికయ్యారు.వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా భారత సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు మరోసారి తమ అనుభవంతో జట్టులో చోటు సంపాదించుకోవడం విశేషం. 2025లో వన్డే క్రికెట్‌ను ప్రభావితం చేసిన ఆటగాళ్లతో రూపొందిన ఈ జట్టు అభిమానుల్లో ఆసక్తిని రేపుతోంది.వన్డే జట్టు 2025లో ఎంపికైన ఆటగాళ్లు: రోహిత్ శర్మ (కెప్టెన్), మాథ్యూ బ్రీట్జ్, విరాట్ కోహ్లీ, జో రూట్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, మ్యాట్ హెన్రీ, జైడెన్ సీల్స్.

## ఇది గంభీర్ ముద్ర ఉన్న వ్యూహమేనా..



హైదరాబాద్ జనవరి 1, 2026 మన గళం, : టీ20 ప్రపంచకప్ 2026 కోసం భారత జట్టును ఎంపిక చేసినప్పటికీ, ఎడమచేతి వేగబౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌కు తుది జట్టులో ఆడే అవకాశం దక్కకపోవచ్చన్న చర్చలు ఊపందుకున్నాయి. ఆసియా కప్ 2025లో అమలు చేసిన వ్యూహాన్నే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రపంచకప్‌లోనూ కొనసాగించాలన్న ఆలోచనలో ఉన్నట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. అదే జరిగితే అర్ష్‌దీప్ టోర్నమెంట్ మొత్తం బెంచ్‌కే పరిమితం కావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.ఆసియా కప్‌లో భారత జట్టు వేగబౌలర్ల కంటే స్పిన్నర్లపై ఎక్కువగా ఆధారపడింది. కొత్త బంతిని జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాతో ప్రారంభించి, మిడిల్ ఓవర్లలో శివమ్ దూబేను ఉపయోగించడం ద్వారా బౌలింగ్ విభాగంలో సమతుల్యత సాధించింది. ఈ ఫార్ములా ఫలితాన్నిచ్చిన నేపథ్యంలో అదే విధానాన్ని ప్రపంచకప్‌లోనూ అమలు చేయాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోందని తెలుస్తోంది.ఈ వ్యూహం ప్రకారం ప్లేయింగ్ ఎలెవన్‌లో ఒకే ఒక స్పెషలిస్ట్ వేగబౌలర్‌గా బుమ్రాకు చోటు దక్కే అవకాశం ఉంది. మిగతా ఓవర్లను హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే వంటి ఆల్‌రౌండర్లతో పాటు ముగ్గురు స్పిన్నర్లతో పూర్తిచేయాలన్నది గంభీర్ ఆలోచనగా సమాచారం. దీంతో కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి వంటి స్పిన్నర్లకు పెద్దపీట వేసే అవకాశముంది.ఇలాంటి పరిస్థితుల్లో అర్ష్‌దీప్ సింగ్ ఎంపికపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచినప్పటికీ, వ్యూహాత్మక కారణాల వల్ల అతడికి మ్యాచ్ అవకాశాలు దక్కకపోవచ్చని అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్క్వాడ్‌లో చోటిచ్చి మరీ ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం ఇవ్వకపోవడం అవమానమేనని కొందరు విమర్శిస్తున్నారు.మరోవైపు గంభీర్ తీసుకుంటున్న నిర్ణయాలను కొందరు సమర్థిస్తున్నారు. ఉపఖండ పరిస్థితుల్లో స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లపై అదనపు స్పిన్నర్ జట్టుకు విజయాలు అందిస్తాడని, అదే గతంలో భారత్‌కు కలిసి వచ్చిందని వారు గుర్తుచేస్తున్నారు. అయితే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నమెంట్‌లో అనుభవజ్ఞుడైన అర్ష్‌దీప్‌ను పూర్తిగా పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

# క్రికెట్ చరిత్రలో 'రన్ ఔట్' కింగ్స్ వీళ్లే..

హైదరాబాద్ జనవరి 1, 2026 మన గళం, : క్రికెట్‌లో బ్యాటింగ్ ఎంత గొప్పగా ఉన్నా, వికెట్ల మధ్య సమన్వయం కాస్త తడబడితే రన్ ఔట్ తప్పదు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక సార్లు రన్ ఔట్ అయిన ఆటగాళ్ల జాబితా ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ టాప్ 5 జాబితాలో ప్రపంచ క్రికెట్‌ను ఏలిన దిగ్గజాలతో పాటు భారత జట్టు లెజెండ్స్ కూడా ఉండటం.ఈ జాబితాలో మొదటి స్థానంలో భారత బ్యాటింగ్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ నిలిచాడు. 'ది వాల్'గా పేరొందిన ద్రవిడ్ తన సుదీర్ఘ కెరీర్‌లో మొత్తం 53 సార్లు రన్ ఔట్ అయ్యాడు. వికెట్ కాపాడటంలో అపారమైన ఓర్పు చూపిన ఆయన, పరుగుల విషయంలో మాత్రం కొన్నిసార్లు భాగస్వాములతో అపార్థాలకు గురయ్యాడు. ఆసక్తికరంగా, ద్రవిడ్‌తో బ్యాటింగ్ చేసిన సహచరులు కూడా పెద్ద సంఖ్యలో రన్ ఔట్ కావడం గమనార్హం.రెండో స్థానంలో శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే ఉన్నాడు. అందమైన బ్యాటింగ్‌కు చిరునామాగా నిలిచిన జయవర్ధనే 51 సార్లు రన్ ఔట్ అయ్యాడు. దీర్ఘకాలం అంతర్జాతీయ క్రికెట్ ఆడటమే ఈ సంఖ్యకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు.మూడో స్థానంలో పాకిస్థాన్ మాజీ స్టార్ ఇంజమామ్ ఉల్ హక్ ఉన్నాడు. వికెట్ల మధ్య పరుగెత్తడంలో ఆయన చేసిన తడబాట్లు క్రికెట్ అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోయే దృశ్యాలే. ఇంజమామ్ తన కెరీర్‌లో 46 సార్లు రన్ ఔట్ అయ్యాడు.నాలుగో స్థానంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ నిలిచాడు. ఫీల్డింగ్‌లో అద్భుతమైన త్రోలతో ప్రత్యర్థులను భయపెట్టిన పాంటింగ్, బ్యాటింగ్ సమయంలో మాత్రం 45 సార్లు రన్ ఔట్ అయ్యాడు.ఐదో స్థానంలో భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. దాదాపు 24 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో సచిన్ 43 సార్లు రన్ ఔట్ అయ్యాడు. కోట్లాది పరుగులు,



వందలాది రికార్డులు ఉన్నప్పటికీ, రన్ ఔట్ విషయంలో ఆయన కూడా మినహాయింపు కాదని ఈ గణాంకాలు చెబుతున్నాయి.ఈ జాబితాలో ఉన్నవారంతా ప్రపంచ క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే దిగ్గజాలే. ఎక్కువ మ్యాచ్‌లు ఆడటం, దీర్ఘకాల కెరీర్ ఉండటమే రన్ ఔట్ సంఖ్య పెరగడానికి ప్రధాన కారణమని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మాత్రం వందల మ్యాచ్‌లు ఆడినా కేవలం 30 సార్లు మాత్రమే రన్ ఔట్ కావడం విశేషంగా నిలుస్తోంది. వికెట్ల మధ్య ఆయనకు ఉన్న వేగం, చురుకుదనమే ఇందుకు కారణమని విశ్లేషణ.

## కొత్త ఏడాదిలో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్న తొలి ఆటగాడిగా ఖవాజా..?

సిడ్నీ జనవరి 1, 2026 మన గళం, : ఆస్ట్రేలియా క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన సీనియర్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా కొత్త ఏడాదిలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే తొలి ఆటగాడిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 37 ఏళ్ల వయస్సులో ఉన్న ఖవాజా రిటైర్మెంట్‌పై అంతర్గతంగా కీలక నిర్ణయం తీసుకున్నారన్న ప్రచారం ఆసీస్ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా, 2026లోనే ఆయన ఆటకు గుడ్‌బై చెప్పడం దాదాపు ఖాయమన్న అంచనాలు వినిపిస్తున్నాయి.వయస్సు, ఫిట్‌నెస్ అంశాలతో పాటు భవిష్యత్తు ప్రణాళికలను దృష్టిలో పెట్టుకుని ఖవాజా ఈ నిర్ణయానికి వచ్చారని సమాచారం. గత కొన్ని ఏళ్లుగా టెస్ట్ క్రికెట్‌లో ఆస్ట్రేలియాకు అత్యంత నమ్మకమైన ఓపెనర్‌గా కొనసాగిన ఆయన, క్లిష్ట పరిస్థితుల్లో జట్టును ఆదుకోవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే తాను తప్పుకోవాలని భావిస్తున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ తర్వాత ఆసీస్ టాప్ ఆర్డర్‌కు ఖవాజానే ప్రధాన బలంగా నిలిచారు. టెస్టుల్లో 5000కు పైగా పరుగులు సాధించిన ఆయన, విదేశీ పిచ్‌లపై కూడా నిలకడగా రాణించారు. ప్రత్యేకంగా గత రెండేళ్లలో ఆయన బ్యాటింగ్ ఆస్ట్రేలియా విజయాల్లో కీలకంగా నిలిచిందన్నది అందరూ ఒప్పుకునే విషయం. అయినప్పటికీ, శారీరకంగా పెరుగుతున్న భారం, నిరంతర అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా ఇక ఎక్కువ కాలం కొనసాగడం కష్టమవుతుందన్న భావనకు వచ్చినట్లు తెలుస్తోంది.క్రీడా వర్గాల సమాచారం ప్రకారం, 202526 యాషెస్ సిరీస్‌ను తన కెరీర్‌కు చివరి ప్రధాన టోర్నమెంట్‌గా భావించే అవకాశముంది. ఆ సిరీస్ తర్వాత లేదా 2026 ప్రారంభంలోనే ఖవాజా రిటైర్మెంట్ ప్రకటించవచ్చని అంచనా. ఇదే జరిగితే కొత్త ఏడాదిలో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్న తొలి అంతర్జాతీయ స్టార్‌గా ఆయన నిలవనున్నారు.ఇక ఖవాజా రిటైర్మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే భవిష్యత్తు ప్రణాళికలు మొదలుపెట్టినట్లు సమాచారం.



టాప్ ఆర్డర్‌లో కొత్త ఓపెనర్ కోసం యువ ఆటగాళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇటీవల స్టీవ్ స్మిత్‌ను ఓపెనర్‌గా ప్రయోగించడమే కాకుండా, దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న యువకులకు అవకాశాలు ఇస్తున్నారు. ఖవాజా వెళ్లిపోయిన తర్వాత ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌లో పెద్ద మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.పాకిస్థాన్‌లో జన్మించి, ఆస్ట్రేలియా జాతీయ జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగిన ఖవాజా ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. మైనారిటీ నేపథ్యం నుంచి వచ్చి ఆసీస్ టెస్ట్ జట్టులో స్థానం సంపాదించి, నాయకత్వ లక్షణాలతో ఆటగాడిగా ఎదిగిన ఆయన కెరీర్ ప్రత్యేకంగా గుర్తుండిపోతుందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందన్నదే ఇప్పుడు అభిమానుల్లో ఉత్కంఠగా మారింది.

## పెద్ద జట్లపై జీరో..

హైదరాబాద్ జనవరి 1, 2026 మన గళం, :విజయ్ హజారే ట్రోఫీలో యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ చేసిన సంచలన ఇన్నింగ్స్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేవలం 84 బంతుల్లో 190 పరుగులు చేసి లిస్ట్-ఎ క్రికెట్‌లో రికార్డులు తిరగరాసిన ఈ కుర్రాడిపై ఒకవైపు ప్రశంసలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. ముఖ్యంగా "చిన్న జట్లపై మాత్రమే రాణిస్తాడు.. పెద్ద జట్లపై కనిపించడు" అనే విమర్శలు అతడిని లక్ష్యంగా చేసుకున్నాయి.విజయ్ హజారే టోర్నీలో బలహీన జట్టుపై ఈ భారీ స్కోర్ వచ్చిందని, అదే స్థాయి ప్రదర్శనను టాప్ జట్లపై చేయగలడా అనే ప్రశ్నలను కొందరు నెటిజన్లు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో అతడిని టీమిండియా భవిష్యత్ స్టార్‌గా పొగిడడం తొందరపాటు నిర్ణయమని విమర్శలు గుప్పించారు. అయితే ఈ ట్రోల్స్‌కు వ్యతిరేకంగా క్రికెట్ వర్గాల నుంచి గట్టి మద్దతు లభిస్తోంది.కేవలం 1415 ఏళ్ల వయసులోనే వైభవ్ ఇప్పటికే యూత్ వన్డేలు, యూత్ టెస్టులు, ఇండియా-ఏ మ్యాచ్‌లు, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, అండర్-19 ఆసియా కప్ వంటి కీలక టోర్నీల్లో శతకాలు సాధించిన విషయాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు. లిస్ట్-ఎ క్రికెట్‌లో భారత ఆటగాడిగా అతి పిన్న వయసులో సెంచరీ చేసిన ఘనతతో పాటు, బౌండరీల ద్వారా అత్యధిక పరుగులు సాధించిన రెండవ భారతీయుడిగా నిలవడం అతడి ప్రతిభకు నిదర్శనమని అంటున్నారు.ఒకే ఒక్క



మ్యాచ్ లేదా ప్రత్యర్థి బలహీనత ఆధారంగా ఒక యువ ఆటగాడి సామర్థ్యాన్ని కొలవడం సరికాదని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. పెద్ద పెద్ద దిగ్గజాలు కూడా కొన్ని మ్యాచ్‌ల్లో విఫలమయ్యారని, కానీ అదే ఆటగాళ్లు తర్వాత కాలంలో చరిత్ర సృష్టించారని గుర్తు చేస్తున్నారు. వైభవ్ సూర్యవంశీ ఇంకా ఎదుగుతున్న దశలో ఉన్నాడని, అతడికి సరైన సమయం, అవకాశాలు ఇస్తే భారత క్రికెట్‌కు పెద్ద ఆస్తిగా మారతాడని మద్దతుదారులు స్పష్టం చేస్తున్నారు.మొత్తానికి రికార్డు ఇన్నింగ్స్‌తో వెలుగులోకి వచ్చిన ఈ యువ సంచలనం చుట్టూ ట్రోల్స్, ప్రశంసలు సమానంగా వినిపిస్తున్నా.. అతడి వయసు, ఇప్పటివరకు సాధించిన ఘనతలను దృష్టిలో ఉంచుకుంటే, విమర్శల కంటే ఓర్పు అవసరమనే మాట క్రికెట్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

## జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా కుటుంబంలో తీవ్ర విషాదం

హైదరాబాద్ జనవరి 1, 2026 మన గళం, : జింబాబ్వే క్రికెట్ జట్టు టీ20 కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ సికిందర్ రజా కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన చిన్న సోదరుడు మహమ్మద్ మెహదీ అనారోగ్యంతో కన్నుమూశాడు. ఈ విషాద వార్తను జింబాబ్వే క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. కేవలం 13 ఏళ్ల వయసులోనే మెహదీ మృతి చెందడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.బోర్డు తెలిపిన వివరాల ప్రకారం డిసెంబర్ 29, 2025న హరారేలో మెహదీ తుదిశ్వాస విడిచాడు. పుట్టినప్పటి నుంచే హీమోఫీలియా అనే రక్తసంబంధ వ్యాధితో బాధపడుతున్న అతడు ఇటీవల ఆరోగ్య సమస్యలు తీవ్రమవడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. డిసెంబర్ 30న వారెన్ హిల్స్ సమాధి స్థలంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జింబాబ్వే క్రికెట్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో సికిందర్ రజా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ఈ క్లిష్ట సమయంలో బోర్డు సభ్యులు, మేనేజ్‌మెంట్, ఆటగాళ్లు, సిబ్బంది అందరూ రజా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. మెహదీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.